# ఆదర్శాలెందుకు?

ఆ రోజు సుదర్శనంగారి కుటుంబ సభ్యులంతా హాలులో సమావేశ మయ్యారు పెద్ద కూతురు రమ తప్ప. రమ పెళ్ళి విషయం చర్చించ బడుతోంది. సుదర్శనంగారి వదనం గంభీరంగా ఉంది. భార్య సీతమ్మగారి మొహంలో బాధ, దుఃఖమూ కనిపిస్తున్నాయి. రెండవ కూతురు ఉమ తల్లి వెనక నిలబడి ఉంది. కుతూహలం పట్టలేకుండా ఉంది. ఆవేశపడుతోంది కూడాను. కొడుకు భాస్కర్ ఏమి పట్టనట్లుగా వింటున్నాడు పెద్దవాళ్ళ మాటల్ని. పెళ్లి మాటలు జరిపిస్తున్న చిన్న బావమరిది జగన్నాధం మాత్రం చిద్విలాసంగా నవ్వుతున్నాడు..

'ఇప్పుడు ఏం చేద్దామంటావో చెప్పు, నువ్వు చెయ్యమన్నట్లే చేస్తాను' అన్నారు సుదర్శనంగారు భార్య వైపు చూస్తూ.

'నేనేం చెప్పగలను. అడకత్తెరలో పోకలాగ నలిగిపోవటం తప్ప' అంది ఆవిడ మాటలు సాగదిస్తూ.

'ఏమైనా చెయ్యగలిగితే చెయ్యి. అతను మీ అన్నయ్యే కదూ'

'అదే వచ్చినబాధ. పరాయివాళ్ళైతే నోటి కొచ్చినట్లు అనగలం. దగ్గర వాళ్లైతేనే కక్కనూలేము, మింగనూలేము. అన్నయ్య అనే అభిమానం మనకే కాదు వాడికీ ఉండాలి; అభిమానం ఉన్నవాడయితే వెయ్యి రూపాయలకోసం పట్టు పడతాడా? ఇట్లాగ బేరమాడతాడా?' ఆవిడ కంఠంలో బాధతో బాటు నిష్ఠురం కూడా ధ్వనించింది.

'ఏం పెద్ద బేరమాడాడులే. పెద్ద కోడలు తెచ్చినట్లే చిన్నవాడికీ పుచ్చుకుంటా నన్నాడు. ఐదు వేలు, ఈ రోజుల్లో పెద్ద కట్నం కానే కాదు. ఇల్లు, పొలం ఉన్నాయి.

వాడికి మంచి ఉద్యోగం ఉంది. పైవాళ్లు 'ఎనిమిది వేలు, పది వేలు ఇస్తామని వస్తున్నారు...' అన్నాడు జగన్నాథం.

'ఇవ్వగలిగి ఇస్తే ముద్దూ ముచ్చటగానే ఉంటుంది. మీ బావగారు ఎక్కడ నుంచి తెస్తారు? ఆయన సంపాదన ఇల్లు గడవటానికే సరిపోతుంది. మా ఆస్తి పాస్తులు మీ అందరికీ తెలియనివా ఏమిటి? ఇంకో ఆడపిల్లకి పెళ్లి చెయ్యాలి. మగపిల్లాడికి చదువు చెప్పించాలి. మూడు వేలు ఇవ్వగలం అనుకున్నాము. అయిన సంబంధం వదులుకోవట మెందుకని ఇంకో వెయ్యి ఇవ్వటానికి సిద్ధపడ్డాం. నాలుగు చాలవు ఐదు వేలు కావాలన్నాడు వాడు. ఇవ్వలేక మానుకోవటమూ బాధే కదురా మరి, చిన్నప్పటి నుంచి అనుకున్నదాయె...' అంది. ఆవిడ ఎటూ తేల్చలేకుండా ఉంది.

'ఇంకెందుకులే మాటలు. అట్లాగే ఇస్తామన్నామని మీ అన్నయ్యతో చెప్పు జగన్నాథం! ముహూర్తం పెట్టించమను. అనుకున్న సంబంధం చెయ్యాల్సిందే. చిన్నప్పటి నుంచీ అనుకున్న మాట ఇప్పుడు కాదనుకోవటం ఎందుకూ? మా తిప్పలు మేము పడతాం. ఒప్పుకున్నామని చెప్పు' అన్నారు సుదర్శనం గారు.

సీతమ్మగారు తృప్తిగా నిట్టూర్చింది.

ఉమ తల్లి వైపు చురుకుగా చూసి రమని వెతుక్కుంటూ పక్క గదిలోకి వెళ్లింది.

రమ మెట్రిక్ పాసవగానే పెళ్లి చేస్తామని చదువు ఆపించారు.

ఉమ కాలేజిలో చేరింది. ఎన్నో ఊహలూ ఉద్దేశాలూ ఉన్న ఉమకి తల్లిదండ్రుల నిర్ణయం కోపం తెప్పించింది. ఉమని చూడగానే రమ నవ్వింది. ఇంకా రమ మొహంలో బాధ పూర్తిగా పోలేదు. ఉమ అక్క మొహంలోకి తీవ్రంగా చూస్తూ,

'ఇక్కడ ఉండి అంతా విన్నావుగా, సంతోషంగా ఉందా?' అంది వ్యంగ్యంగా.

రమ చెల్లెలి మొహాన్ని పరిశీలనగా చూడలేదు. తన ఆలోచనలలో సగం పరధ్యాన్నంగా ఉంది.

ఔనే, కట్నాలకి పేచీ వచ్చి పెళ్లి ఆగిపోతుందేమోనని నా మనసు ఎంత ఊగి పోయిందో. బావని తప్ప చచ్చినా నేను ఇంకొకరిని పెళ్లిచేసుకోను.' నాన్న ఎంత మంచివారు!' రమ కళ్లలో నీళ్లు మెరిశాయి

'ఔను, చాలా మంచివారు, మంచివారని సంతోషించటమేనా? మన వలన ఆయనకి బాధ కలగకుండా ఏమీ చెయ్యలేమూ! నువ్వు బావని తప్ప పెళ్లి చేసుకోవు!

ఎంత ప్రేమ? అంత 'ప్రేమ' నీ ఒక్కర్తెకేనా? అతడు ఉలుకూ పలుకూ లేకుండా ఉన్నాడెందుకు? కట్నం అవసరం లేదని తండ్రితో చెప్ప లేడూ? మళ్లీ ఉద్యోగం కూడా చేస్తున్నాడు. బావతో పెళ్లయిపోతే చాలు నీకు. అతడికి నువ్వంటే ప్రేమ ఉన్నా, లేకపోయినా సరే, నాన్న ఏమయిపోయినా సరే. డబ్బు ఎక్కడనుంచి తెచ్చినా సరే. అప్పుల పాలైనా సరే...'

'ఉమా!' అంది బాధగా రమ.

'నాకు మాత్రం వాళ్ళు కట్నం అడిగారని పేచీ పెట్టారనీ బాధగా లేదనుకుంటున్నావా? కానీ ఒక్క వెయ్యి రూపాయల కోసం చిన్నప్పటి నుంచి పెంచుకున్న మమతని ఎట్లాగ తెంచుకోవటం? అది మాటలు కాదు, నీకు తెలీదు ఉమా. వాళ్లు పట్టుపట్టారని మనమూ పట్టుపడితే...'

'ఆ! మనవంటి వివేకవంతులు ఉండటం వల్లనే మూర్ఖుల ఆటలు సాగుతున్నాయి. నేనయితే చచ్చినా కట్నం ఇచ్చి పెళ్లి చేసుకోను. పెళ్లి కాకపోతే ఇట్లాగే ఉండిపోతాను. తల్లిదండ్రుల్ని ప్రేమించలేని వాళ్లకి ప్రేమేమిటి? ఇన్నేళ్లు మనని కని పెంచి పోషించిన తల్లిదండ్రుల కష్ట సుఖాలు ఆలోచించకుండా మన దోవ మనం చూసుకుని సుఖపడాలని కోరుకోవటం స్వార్థం! మనుషులు చెయ్యాల్సిన పని కాదు.' అంది ఉమ.

రమ మొహం తెల్లగా పాలిపోయింది.

నువ్వు అనుకున్నట్లుగా చెయ్యగలిగితే నువ్వు చాలా అదృష్టవంతురాలివి ఉమా' అంది బొంగురు గొంతుకతో.

రమ మాటలు వినిపించుకోకుండానే విసురుగా అక్కడనుంచి వెళ్లి పోయింది ఉమ.

* * * *

అందరూ ఉమని 'అదృష్టవంతురాలు' అన్నారు.

ఉమ తన మాటమీద నిలబడి కట్నం అడిగిన సంబంధాల్ని పెళ్లి చూపులకి కూడా అంగీకరించలేదు. రెండేళ్లు గడిచి బి.ఏ. కూడా పాసయ్యే సరికి ఉమ కోరిక నెరవేరింది. మోహనరావ్ కట్నం లేకుండా పెళ్లి చేసుకోడానికి ఒప్పుకున్నాడు. అతడితో పెళ్లి అయిపోయింది ఉమకి.

పెళ్లయిన మర్నాడు. ఇంట్లో సందడి తగ్గిపోయింది. సాయంత్రమే ఉమ

ప్రయాణం. మోహనరావు, బావశివరామ్‌పందిట్లోకూర్చుని మాట్లాడుకుంటున్నారు. ఉమ కూడా అక్కడే ఉంది.

'కట్నం లేకుండా మా ఉమని మీరు పెళ్లి చేసుకున్నందుకు మిమ్మల్ని అభినందిస్తున్నాను, మా ఉమ ఆశయం నెరవేరింది' అన్నాడు శివరామ్

ఇందులో అభినందించేందు కేముంది! మన సాంఘిక పరిస్థితుల్ని, ఇప్పటి ఆర్థిక వ్యవస్థలో మధ్య తరగతి స్థితిని చూస్తే కట్నాలనేవి ఎంత దురాచారమో బోధపడుతుంది ఎవరికైనా. చదువుకున్నవాళ్లం, ఆర్థిక లోపం లేనివాళ్లం మనమే కట్నాలు కావాలంటే ఈ సంఘం బాగుపడేది ఎప్పుడో ఎట్లానో చెప్పండి? ఉమ నాకు, మా వాళ్లందరికీ నచ్చింది. మా కుటుంబాలకి పరిచయం ఉంది. అంతే. పెళ్లి చేసుకున్నాను. మీరు మాత్రం...కట్నం తీసుకున్నారని నేననుకోను' అన్నాడు మోహనరావు. సమాధానంగా.

శివరామ్ నవ్వుతూ.

'దాన్ని కట్నమనండీ, లాంఛనాలనండీ, ఆచారంగా వస్తున్నదాన్ని నేనూ పాటించాను. ఐదు వేలు కట్నం తీసుకున్నాను. ఉమకి అందుకని నేనంటే కోపం కూడాను. రమ బదులు ఉమ అయితే మా సంబంధం తెగిపోయి ఉండేది. మీ వలన ఉమ ఆశయం నెరవేరింది' అన్నాడు.

మోహనరావు ఏమీ మాట్లాడలేదు కానీ ఉమ కళ్లు అతిశయంతో మిలమిలా మెరిశాయి.

పెళ్లికి వచ్చిన బహుమతుల్ని సర్దుదామంది రమ. ఆ విషయం గుర్తు వచ్చి లోపలికి వెళ్లింది ఉమ. హాలు దాటి గది దగ్గరకు వెళ్లి ఆగిపోయింది. లోపల నాన్న, అమ్మ, రమ మాట్లాడుకుంటున్నారు.

'ఉమకి వాళ్లు ఒక నగ కూడా పెట్టలేదు' అంది సీతమ్మగారు.

'రమ పెళ్లికి కట్నం ఐదు వేలు ఇవ్వాలని ఆలోచించాం కానీ రెండు వేలలో పెళ్లి ఖర్చులన్నీ జరిపించి పెళ్లి బాగానే చేశాం, వాళ్లు రమకి రెండువేలు నగలు కూడా పెట్టారు. ఉమ పెళ్లికి కట్నం లేదన్న పేరే కానీ జగన్నాథం లెక్కలు వేసి తేల్చాడు, పది వేలు ఖర్చయింది. ధరలూ పెరిగాయి. కట్నం తీసుకోలేదని వాళ్లంటే అతి గౌరవం. ఏ లోటూ రాకూడదని భయం. లాంఛనాలూ వేడుకలూ తప్పలేదు కదా. పైగా వాళ్లు ఉమకి ఒక్క కాసు బంగారం కూడా పెట్టలేదు. ఏమైనా వాళ్లూ

వాళ్ళూ మనసులు కలిసి సుఖంగా ఉంటే అదే భాగ్యమూ బంగారమూ అనుకోవాలి అన్నారు' సుదర్శనంగారు.

'మరి ఈ పెళ్ళికైన పది వేలూ...' అని ఆగిపోయింది రమ.

'మీ నాన్న నిలవ చేశారనుకుంటున్నా వేమిటి? ఐదు వేలు ప్రావిడెంటు ఫండు లోను, ఐదు వేలు సుబ్బారావు దగ్గర అప్పూ....' అంది సీతమ్మగారు.

'ఐతే నెలనెలా జీతంలో...' రమ కంఠం బాధతో పూడుకు పోయింది.

'అవన్నీ నీకెందుకులే తల్లీ. మేం చూసుకుంటాముగా. మనం నాటిన చెట్లు బాగా పుష్పించి ఫలిస్తే ... ఎంత శ్రమ పడినా సంతోషంగానే ఉంటుంది. కానీ కష్టమనిపించదు తల్లీ. మీరిద్దరూ మంచి ఇళ్ళకే వెళ్లారు. ఇంకా వాడు... మగపిల్లవాడిదంత బెంగ లేదు. దేవుడి దయ వలన' అన్నారు సుదర్శనంగారు.

ఉమకి అడుగు ముందుకి పడలేదు. మొహం వాలిపోయింది. తల తిరుగుతున్న ట్లనిపించింది. ఏకాంతంగా తన మనసులోకి చూసుకోవాలనిపించి మూల గదిలోకి వెళ్లింది.

తన ఆశయం నెరవేరిందని గర్వంగా సంతోషంగా ఉంది ఇప్పటిదాకా. కట్నం అడగకుండా మొహనరావు తనని కోరి పెళ్లి చేసుకున్నాడు.

తన స్నేహితురాళ్లలో ఎవరికీ పట్టలేదు ఈ భాగ్యం. ఇప్పటిదాకా అందరూ తనని అభినందించినవాళ్లే. చివరికి విమల కూడా.

'అదృష్టవంతురాలివి ఉమా. కట్నం ఇవ్వకూడదనుకుంటే ఈ జన్మలో పెళ్లి కాదు. దానికి నేనే నిదర్శనం. బ్రతుకంటే విరక్తి పుడులోంది. నీలాంటి అదృష్టవంతులూ పది వేలకైనా ఒకరు ఉంటారో ఉండరో!' అంది.

కానీ ఇప్పుడు తను విన్న సంభాషణకి అర్థం?

'కట్నం ఇచ్చి చేసిన రమ పెళ్లికంటె కట్నం లేకుండా అయిన తన పెళ్లి ఖర్చు ఎక్కువైంది. ఇంక కట్నం ఇవ్వలేదన్న ఆదర్శంలోని ఆంతర్యం ఏమిటి?'

ఇప్పటిదాకా ఉమలో ఉన్న సంతోషం అణిగిపోయింది. బాధ కలిగింది. ఐనా మోహనరావు తనని కోరి చేసుకున్నాడన్న తృప్తి మిగిలింది. అతడంటే చెప్పలేనంత గౌరవం, ప్రేమ ఏర్పడ్డాయి ఉమలో, 'అతడితో కాపురం ప్రారంభించేటప్పటికి.

* * * *

తండ్రికి ఆరోగ్యం బాగుండలేదని తల్లి దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది. భర్త ఎప్పుడు వస్తాడా అని ఎదురు చూసింది ఉమ. మోహనరావ్ ఇంటికి వచ్చి కాఫీ తాగుతుంటే అతడికి ఉత్తరాన్ని అందించింది. చదివి,

'ఒకటే విశేషం. మీ నాన్నకి వంట్లో బాగుండటంలేదుట' అన్నాడు మోహనరావు.

'ఊఁ, నేను వెళ్లాలనుకుంటున్నాను' అంది ఉమ.

'ఇప్పుడేమంత ప్రమాదమని! అట్లాగ రాయలేదు. ముసలివాళ్లకి జబ్బులూ మూలుగులూ ఉండటం సహజమే. నువ్వు వెడితే నేనొక్కడినీ ఉండగలనా! హోటల్ భోజనం నాకు పడదని నీకు తెలుసు కదూ.' చూపుడు వేలితో ఉమ బుగ్గ మీద మీటి నవ్వుతూ అన్నాడు.

ఉమ కోరికకి ఆలోచనలకి తాళం పడిపోయింది.

మోహనరావు మాటలకి ఎదురు చెప్పలేదు ఉమ. అతడంటే తనకి ఆరాధన. అతడికి కూడా తనంటే ప్రేమ. అతడికి ఎదురు చెప్పి అతడిని నొప్పించలేదు తను. ఆ మృదుత్వం తనలో ఉండటం వలనే ఇప్పటి వరకూ తను అనుకునే విధంగా ప్రవర్తించలేకపోతోంది. అది బాధ కలిగిస్తూనే ఉన్నా ఎప్పటికప్పుడు మోహనరావు ప్రేమలో దాన్ని మరిచిపోగలుగుతోంది.

కానీ ఇదివరకు లాగా ఇప్పుడు మనసు శాంతించలేదు. పెళ్లయ్యాక ఈ రెండేళ్లలో ఇట్లాగ చాలా సార్లే జరిగింది.

మొదటి సారి పండగకి వెళ్లినప్పుడు!

రమ, బావకూడా వచ్చారు. నాన్న అందరికీ బట్టలు పెట్టారు. అల్లుళ్లిద్దరికీ బిన్నీ కాటన్ పాంటు, షర్టు గుడ్డలు ఇచ్చారు.

ఇప్పుడు ఇవ్వన్నీ ఎందుకు? ఇవ్వకపోతేనేం? అన్నాడు మోహనరావు. కానీ అతడి ముఖంలో అసంతృప్తి పసికట్టింది ఉమ. అతడు తన స్నేహితుడికి మామగారు టెరిలిన్ గుడ్డలూ, స్కూటరు, ఇచ్చారని చెప్పడం గుర్తు వచ్చింది. ఇంతకంటె ఖరీదైన గుడ్డలు పెడితే బాగుండేది అనిపించింది, కానీ తండ్రి ఆర్థిక పరిస్థితి తెలుసు. మనసులోనే అసంతృప్తిని అణుచుకుంది. కానీ ఆ మధ్యాహ్నమే రమ చేసిన పని మళ్ళీ ఉమకి బాధాకరమైంది. తల్లి ఇచ్చిన చీర కట్టుకుని రమ తిరిగి తల్లికి, తమ్ముడికి బట్టలు పెట్టింది. ఉమకి కూడా ఒక జాకెట్టు గుడ్డ

ఇచ్చింది. బావ నాన్నకి ఉపయోగిస్తుందని ఒక చేతికర్ర బహూకరించాడు.

అసలు ఉమ పండగకి వచ్చేముందర తమ్ముడికోసం ఏదైనా తేవాలనుకుంది కానీ మోహనరావు ముందరే షరతు పెట్టాడు.

'ఇప్పుడు నీకోసమే ఈ ప్రయాణం, వంద రూపాయల ఖర్చు. ఇంకేమీ కొనకూడదు. ఈ నెల సేవింగు ఆగిపోయింది.'

ఉమ నోటికి తాళం పడిపోయింది, చొక్కా కొనకపోతే పోనీ మిఠాయి కోసమైనా ఐదు రూపాయిలు అడగలేకపోయింది.

పండగ రోజు సాయంత్రం నలుగురూ సినిమాకి వెళ్లారు. మోహనరావు రమతో, ఉమతో కబుర్లు చెప్తుంటే బావ వెళ్లి టికెట్లు కొనుక్కొచ్చాడు.

ఉమ మనసులో సిగ్గు పడింది. అభిమాన పడింది కానీ పైకి ఏమీ అనలేదు మోహనరావుకి తనంటే ప్రేమ, తనని ఒక్క క్షణం కూడా వదిలి ఉండలేదు, కానీ మరి తనెందుకు అతడి దగ్గర నోరు విప్పలేకపోతోంది! మనసు ముడుచుకుపోతోంది! అనే ప్రశ్న ఉదయించింది మొదటి సారిగా. మనోవేదన ఆరంభమైంది.

అప్పుడప్పుడు జరిగిన ఇటువంటి సంఘటనలూ అసంతృప్తిని కలిగిస్తూనే ఉన్నాయి. కానీ ఇదివరకు లాగ ఇవాళ మనసు శాంతించలేదు.

'ముసలివాళ్లకి జబ్బులు రావటం సహజమా! నాన్న అంత ముసలివారేం కాదు. పడుచువాళ్లకి భార్య లేకపోతే గడవకపోవటం కూడా సహజమే నన్నమాట! నేను అతడికి అవసరం అంతే. అదంతా ప్రేమ కాదు. రానురాను నాకు మోహన్ మీద అభిమానం అనురాగం పోయి అసహ్యం, ద్వేషం పుడుతున్నాయి! ఈ మనసుని నిగ్రహించుకోవటం కష్టంగా ఉంది! అతడి ననటం ఎందుకు? ఆడపిల్లకి పెళ్లవగానే పరాయిదైపోతుంది. మనసులో ఎంత అభిమానం కృతజ్ఞతా ఉన్నా చూపించుకోలేదు.' అనుకొని నిస్పృహతో తనని సమర్థించుకోటానికి ప్రయత్నించింది ఉమ.

* * * *

రెండు రోజుల తర్వాత మళ్లీ ఉత్తరం వచ్చింది. రమ రాసింది.

'నాన్నకి ఈ మధ్య వంట్లో బాగుండటం లేదు. అమ్మ రాసిన ఉత్తరం అందిందని తలుస్తాను. నాన్న 'అనవసరంగా బాధ పడుతుందని' నీకు రాయద్దన్నారు,

ఐనా నీకు చూడాలని ఉంటుంది కదా అని నేనే రాస్తున్నాను. వీలుగా ఉంటే ఒకసారి రా. నిన్ను చూసి చాలా రోజులైంది.'

ఉమ మళ్లీ ఆలోచనలో పడింది. రమ దగ్గరలోనే ఉంది కదా వచ్చి ఉంటుంది తనకేం? బావ రమ ఎల్లాగ చెప్తే అల్లా చేస్తాడు. మనసులో మాట గ్రహిస్తాడు ముందుగానే. మోహన్ మాత్రం! అడిగితే కాదనడు. తనే అడగదు. ఎందుకనో అడగలేదు. ఏమైనా సరే ఈ సారి వెళ్లాలి. నాన్నని చూసి రావాలి.'

ఉమ తను వెళ్లక తప్పదంది; మోహనరావు తను కూడా వస్తానన్నాడు. వారం రోజులు సెలవు పెట్టాడు. ఉమ సంతోషించింది.

రిక్షా దిగి లోపలికి వెడుతుంటే రమ ఎదురు వచ్చింది.

'ప్రయాణం బాగా అయిందా? అంది ఆప్యాయంగా భుజంమీద చెయ్యి వేసి.

'ఫస్టు క్లాసు రిజర్వేషన్ ఉంది కదూ' అన్నాడు మోహనరావు

లోపలికి వెళ్లారు. గదిలో సుదర్శనంగారు పడుకొని ఉన్నారు. చాలా కృష్ణించి పోయారు. ఉమని చూడగానే సీతమ్మగారు కళ్ల నీళ్లు పెట్టుకుంది.

'దాన్ని ఎందుకల్లాగ కంగారు పెడతావు అమ్మా' అంది రమ.

తల్లి సంగతులన్నీ చెప్పటం మొదలు పెట్టింది.

ఏడాది నుంచి ఆయన సుస్తీగా ఉంటున్నారు. మూడు నెలల నుంచీ పనిలోకి వెళ్ళటంలేదు. రెండు సార్లు కళ్ళు తిరిగి పడిపోయారుట, లివర్ చెడిపోయింది. పథ్యం చేయక అశ్రద్ధ చేశారు. రెండు నెలల కిందట చాలా ప్రమాదించింది. అప్పుడు రమ, శివరామ్ చూడటానికి వచ్చారు. శివరామ్ మంచి డ్యాక్టర్ని పిలిచి చూపించాడు. రెండు నెలలు వైద్యం చేయిస్తే జబ్బు తగ్గుముఖం పట్టింది.

'భాస్కర్ ఏడి' అని అడిగింది ఉమ తమ్ముడు కనిపించలేదని.

'వాడు ఏడాదినుంచి అక్క దగ్గరే ఉండి చదువుకుంటున్నాడు కదటే. చదువు పాడవుతుందని అక్కడే ఉండి అప్పుడప్పుడు వస్తున్నాడు' అంది సీతమ్మగారు. అంటే భాస్కర్ని బావ చదివిస్తున్నాడన్నమాట. సాయంత్ర మయ్యేసరికి ఇంకా ఎన్నో సంగతులు అర్థమయ్యాయి.

బావ వారాని కొకసారి వచ్చి డ్యాక్టరుతో మాట్లాడి కావలసిన అవసరాలన్నీ చూస్తున్నాడు. రమ రెండు నెలలనుంచీ ఇక్కడే ఉంది, పెద్ద కొడుకుని అత్తగారి దగ్గర వదిలి చిన్నవాడిని తన దగ్గర ఉంచుకుంది. వాళ్ళ ఇంటి పాలేరును రమకి

సాయంగా ఉంచాడు బావ.

'బావకి మాత్రం రమ అంటే ప్రేమ లేదూ. వాళ్లు మాత్రం పడుచువాళ్ల కాదూ, రమని ఇక్కడ ఎట్లాగ వదిలి పెట్టాడు బావ! వాళ్లు మాత్రం డబ్బు నిలవ వేసుకోలేరూ?' ఉమని ప్రశ్నలు వేధిస్తున్నాయి.

'ఇంకో నెలలో నాన్న ఆరోగ్యం బాగయిపోతే....పనిలోకి వెడతారు మళ్ళీ' తల్లి ధైర్యంగా, ఆశగా అంది.

ఉమ మనసంగా కలిగిపోయింది. కళ్లలో నీళ్లు తిరిగాయి. తన వ్యక్తిత్వం కరిగి కరిగి అణుమాత్రమైనా మిగలకుండా కొట్టుకుపోయిన ట్లనిపించింది. మనసంతా శూన్యంగా అయిపోయింది.

రమ పకోడీలు చేసింది సాయంత్రం. ప్లేటులో పెట్టి తీసుకెళ్లి భర్తకి ఇచ్చింది ఉమ.

మీ అక్క చెల్లెళ్ల కబుర్లకి అంతు లేదా? తోచక చస్తున్నాను నేను. సినిమాకు వెడదాం' అన్నాడు మోహనరావు.

'ఇప్పుడా!' అంది ఉమ అయిష్టంగా.

'ఊఁ, మీ నాన్న కులాసాగానే ఉన్నారు కదూ. ఫార్మాలిటీస్ అంటే నాకు చిరాకు' అన్నాడు.

మనసులో అసహ్యం, ఏడుపు పొర్లి పొర్లి ఏదో కట్టను తెగ్గొట్టినట్లయింది. మనసు విరిగిపోయింది. ఇంక యుద్ధం, సంఘర్షణా లేవు. అంతమయ్యాయి.

'సరే, వస్తాను' అంది అతడి మొహంలోకి చూసి నవ్వుతూ నిర్లిప్తంగా. ఇద్దరూ ముస్తాబై సినిమాకి వెళ్ళొచ్చారు. రిక్షాలో ఉమ నడుం చుట్టూ చెయ్యి వేసి,

'నువ్వెంత బాగుంటావో తెలుసా!' అన్నాడు మోహనరావు.

'తెలుసు' అంది. ఉమకి మైకం కమ్మలేదు.

రమ ఇద్దరికీ అన్నం వడ్డించింది. సినిమా బాగుందా అని అడిగింది. పిల్లవాడు ఏడుస్తుంటే సముదాయించటానికి వెళ్లిపోయింది. భోజనం చేసి మోహనరావు తన గదిలోకి వెళ్లాడు. కంచాలు సర్దేసి ఉమ రమ దగ్గరికి వెళ్లింది. పక్కన కూర్చుంది.

'ఏమిటే ఉమా పడుకోరాదూ.... నిద్ర రావటంలేదూ' అంది రమ.

ఉమ ఏడుపు ఆపుకోలేకపోయింది. రమ ఒడిలో మొహం దాచుకుని వెక్కి వెక్కి ఏడిచింది.

'అదేమిటి పిచ్చిదానా! ఇప్పుడేమయిందని. నాన్నకేమీ భయం లేదు. ఐనా ధైర్యంగా ఉండాలి. అల్లాగ ఏడుస్తారా ఎక్కడైనా' అంది రమ ఉమ తల నిమురుతూ.

ఉమ కన్నీళ్లు తుడుచుకుని నవ్వేసింది. మాట్లాడకుండా అక్కడనుంచి వచ్చేసింది. గదిలోకి వెళ్ళబుద్ధి అవలేదు. బయటి వరండాలోకి వెళ్ళి నిలబడింది.

'అవును నాన్నకేమీ భయం లేదు. నువ్వు ఉన్నావు. బావ ఉన్నాడు. నేననుకున్న వన్నీ నువ్వు చేస్తున్నావు. నువ్వు అదృష్టవంతురాలివి రమా!' అనుకుంది చీకటిలోకి చూస్తూ.

* * * *

వారం రోజులు ఇట్టే గడిచిపోయాయి ఉమకి. పెట్టె సర్దుతోంది.

'ఎట్లాగో వారం గడిచింది. సర్దుతున్నావు కదూ, వెడదామా?' అన్నాడు మోహనరావు.

ఉమ తలెత్తకుండా బట్టలు సర్దుతోంది.

ఇప్పుడు ఉమలో ఆదర్శాలేమీ మిగలలేదు. రమ, బావా అలంకరింప బడిన దేవతామూర్తుల్లాగా మనసులో నిలిచిపోయారు. తనలో ఉన్న ప్రేమ, ఆర్ద్రతా హరించుకు పోయినట్లుగా మనసు శూన్యంగా ఉంది. మోహన్ పట్ల తనకేమీ అనురాగం మిగలటంలేదు. తన కళ్ళ పొరలు విడిపోవటం తన దురదృష్టం. అతడిదంతా ప్రేమ కాదు. సంకుచితమైన మనస్తత్వమని ఇప్పుడు అర్థమైపోయింది. తను అతడి విషయంలో ఏమీ చెయ్యలేదు. హృదయ వైశాల్యమనేది ఒకరు బోధించి నేర్పించగల విషయం కాదు. ఇంక తను అతడిని ప్రేమించలేదు.

అక్కా బావా ముందర తనూ మోహన్ రంగులు వెలిసిన బొమ్మల్లాగ వెలాతెలా పోతున్నారు. మోహన్ అంటే జాలి తప్ప ఇంకేమీ మిగలటంలేదు తనలో.

చందమామని తెచ్చి ఇంట్లో కట్టేసుకోవాలని కాదు మనం కోరుకో వలసింది. కొంచెం సానుభూతి, కొంచెం త్యాగబుద్ధి మనిషిలో ఉంటే చాలు. మన మనసుల నిండా, ఇంటి నిండా వెన్నెల జల్లు కురుస్తుంది...

తన ఆలోచనల్ని బలవంతంగా అవతలికి నెట్టి

'ఆ, వెడదాం. మనం వచ్చిన పని అయింది కదూ' అంది ఉమ నిర్వికారంగా.

* * * *